సభ్యత్వం రెట్టింపు కావాలని, [illegible] యాభైవేల పౌనులనిధి కావాలని, బ్రిటిష్ [illegible] ఇచ్చింది. ఇది జరగవన్నారు [illegible] ఇది నెరవేరడమే కాకుండా, అంతకన్నా [illegible] వసూలయింది. ఈ విధంగా బ్రిటన్‌లోని [illegible] పార్టీప్రజల పార్టీ అని ప్రజానీకమే [illegible] ఇండియాలో ఐక్యతావశ్యమ [illegible] ఇప్పుడు ఆహారపదార్థాల విషయంలోను [illegible] పార్టీకి ప్రజలకువున్న సన్నిహితసంబంధం [illegible] తోంది. మొదటలో పార్టీ రెండు లక్షల [illegible] నిధికి పిలుపునిచ్చింది. ఇప్పుడు పదిలక్షలు [illegible] పత్రికల విషయమూ-వాటి ప్రచారం రోజురోజుకు [illegible] గుతూవుంది. దీనికి కారణం బ్రిటన్‌లోను [illegible] లోను, ప్రజల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని [illegible] దైనందిన సమస్యలను పరిష్కరించడానికి [illegible] స్తున్నా, ప్రజా ఐక్యతను సాధించడానికి [illegible] చేయడమే ప్రజలు దీనిని గుర్తించారు. [illegible] ప్రజలే కంటిలో పాపలాగా, కాపాడుతుంటారని [illegible] చెప్పాలా?

# అల్లిపురం జైలులో రాజకీయ ఖైదీల పరిస్థితులు

★

28-12-42 వ తేదీని విడుదల అయి వచ్చిన కామ్రేడ్సు సి వి కె రావు, పి. ఎస్. శర్మ (కాకినాడ) అల్లిపురం జైలు (బళ్ళారి)లో రాజకీయఖైదీల పరిస్థితుల్ని గురించి ఈ క్రిందిప్రకటన గావిస్తున్నారు:

"అల్లిపురం జైలులో దాదాపు 1500 మంది సత్యాగ్రహులు, 21 మంది కమ్యూనిస్టులు, నిర్బంధింపబడియున్నారు.

"వీరి కెవరికీ జాబులుగాని, ఇంటర్వ్యూలు గాని, లేవు. మత సంబంధమైన పుస్తకాలు మాత్రమే యిస్తారు. ఏ బి తరగతులకు సహితం వార్తాపత్రికలు లేవు. నీటిసప్లయి తగినంతగా లేకపోవటవల్ల స్నానాలు మూడు, లేక నాలుగు, రోజుల [illegible] చేయవలసి వస్తోంది. పాయఖానాదొడ్లు [illegible] వుండాలో అంత ఖరాబుగా వున్నాయి. వైద్యసహా [illegible] యం బహుతక్కువ అనేకమంది మలేరియా, విరేచనాలు, మొదలైన జబ్బులతో బాధపడుతున్నా [illegible] టికి, వారిని బ్లాకులలోనే ఉంచుతున్నారు. [illegible] ఆసుపత్రిలో తగినంత [illegible] లేకపోవడమే [illegible] వున్న 3 నెలలలో యిద్దరు రాజకీయ ఖైదీలు [illegible] పోయారు. బియ్యం పాడువాసన. వాటినిండా రాళ్ళు. ఇంతమంది రాజకీయ ఖైదీలకు యిపుడున్న [illegible] లో స్థలం [illegible] చాలదు. కామ్రేడ్ మురుగేశన్(మద్రాసు)కు విధించిన శిక్షనుగురించి హైకోర్టులో అప్పీలు చేసుకొనే నిమిత్తం క్రింది కోర్టు తీర్పుకాపీ కావాలని ఎన్నోసార్లు [illegible] పట్టించుకోలేదు. అప్పీలుకు (3 నెలలు) దాటిపోయింది. అతను [illegible] శిక్ష అనుభవించాలి."

ప్రపంచ యుద్ధ సమీక్ష

# 12 లక్షల నాజీ సేనకు ప్రమాదం

"1942 సెప్టెంబరులో, జర్మనీ, విజయం తనవాకిట ముందు వుందని తలచింది. కాని, దాని పైనే పెద్ద జవాబు వచ్చింది. సెప్టెంబరు 30న, హిట్లరు, స్టాలిన్‌గ్రాడ్ తన జేబులో పడిపోయిందని తలిచాడు. కాని, స్టాలిన్‌గ్రాడ్ జర్మనీకి స్మశానవాటిక అయింది."

—ఇల్యా ఎహ్రెన్‌బర్గు (రష్యా)

"రెడ్ ఆర్మీ - వెయ్యి తలల రాక్షసి. ఒక తల నరికేస్తే, మరో తల లేస్తుంది."

—హాన్స్ ఫ్రిషీ (జర్మనీ)

సోవియటు శైత్యయాత్ర అకుంఠితంగా సాగుతోంది. విజయపరంపరలతో, "ముందుకే ముమ్ముందుకే" అంటోంది. ఫాసిస్టు దాస్య శృంఖలాలను బ్రద్దలు చేస్తూ, ప్రపంచాన్ని నాజీ రాక్షస పాదాక్రాంత ప్రజలకు విముక్తి కల్గించబోయేది వీర రెడ్ ఆర్మీ. భవిష్యదితిహాసంలో, 1942 నవంబరు 19 వ తేదీ స్వర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. ప్రపంచాధిపత్యానికై కలలు గన్న ఫాసిస్టు జర్మనీ పతనానికి, నశనానికి, నాంది ప్రస్తావన జరిగిన దినమది. ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో మహత్తర చారిత్రిక ప్రాముఖ్యతను పొందనున్న రోజది.

నవంబరు 19 వ తేదీన ప్రారంభించబడిన సోవియటు ఎదురు దాడుకు గత. సంవత్సరవు ఎదురు దాడులకూ పోలికలేదు. గత సంవత్సరం కంటె, చేసిన దెబ్బ గట్టి దెబ్బ తీయుటలో, సోవియటుయూనియన్. ఈ సంవత్సరం మించిపోయింది గత సంవత్సరం వలె గాక, హిట్లరు సైన్యంలో నగ భాగం చుట్టుముట్టబడింది. వినాశనమయ్యే అవకాశాలున్నాయి. బ్రిటిషు, అమెరికను సైన్యాలు, ఆఫ్రికాలోను ముగించుకొని యూరప్‌లోకి యుద్ధాన్ని తాక్కెళ్లినవారు. గత సంవత్సరం వలె హిట్లరు ఈ సంవత్సరం కోలుకోలేడు. బ్రిటిషు, అమెరికను ప్రజలు యూరపులో రెండవ రంగం తెరిచేటట్లు ఒత్తిడి తేవాలి. అపుడు సోవియటు యుద్ధరంగంలో ప్రారంభించిన హిట్లరు పరాజయం, యూరపు యుద్ధరంగంలో ముగుస్తుంది.

## నాడు — నేడు

గత సంవత్సరం కంటె. ఈ సంవత్సరం సోవియటుకున్న అవకాశాలేమిటో చర్చిస్తూ, పైవిషయాన్నే కామ్రేడ్ కాలినిన్ నొక్కి చెబుతున్నారు.

"రెడ్ఆర్మీ, హిట్లరు ఆశలను అడియాసలు గావించింది. గతసంవత్సరం కంటె ఇపుడు మన పరిస్థితి అనుకూలంగా వుంది. ఈ యేడు శత్రువు దాడి యూరపు రంగంలోను జరుగలేదు. దక్షిణ, నైరుతిభాగంలోనే జరిగింది. అతనికి ఇప్పుడు విజయాలు కొద్దే. అతని దెబ్బగొట్టే శక్తి తగ్గిపోయింది. అతని నష్టాలు విపరీతం. గతసంవత్సరంకంటె ఈ సంవత్సరం ఎక్కువ నష్టం కల్గింది స్టాలిన్‌గ్రాడ్ లోను, మధ్య రంగంలోను, ఉత్తర కాకాసస్‌లోను, మన ఎదురుదాడులు. పరిస్థితిని మన కనుకూలంగా మార్చాయి. జర్మన్లకు కల్గిన విపరీత నష్టాలు ముమ్ముందు ఈ రంగాలలో బోధపడ

మనదేశరక్షక, దెబ్బతీయాలనే ఉన్నాయి. అది, మన ఉత్పత్తిని పెంపొందింపుతోంది. మన కార్మికుల, సమిష్టిస్వవసాయకుల, తీవ్రప్రయత్నాలవలన. రెడ్ఆర్మీకి గావలసినవన్నీ సప్లయి అవుతున్నాయి 1943 ప్రారంభంలోనే విజయచిహ్నాలు తళుక్కుగా కన్పించుచున్నాయి. మనమహానాయకుడగు స్టాలిన్ నాయకత్వం క్రింద మన ఐక్యప్రయత్నం మనకు విజయాన్ని తెస్తుంది."

గత ఎనిమిది వారాలలోను సోవియటు సాధించిన విజయాలేమిటో డిసెంబరు 31వ తేదీన మొదటి ఆరు వారాల సమీక్షను, సోవియటు ఇన్‌ఫర్మేషన్ బ్యూరో ప్రకటించింది. అది గమనించుదాం

"1942 సెప్టెంబరు స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంవల్ల తెలిసిన విషయం ఇది:— స్టాలిన్‌గ్రాడ్‌ను పట్టుకోవాలని, వాల్గా నుండి, పురల్సునుండి, యూరోపియన్ రష్యాను వేరు చేయాలని, మాస్కోను చుట్టుముట్టిపశపరచుకోవాలని, జర్మనీప్లాను. కాని అది గాలిమేడలాగ కూలిపోయింది. దీనికి కారణం, సోవియటు రిజర్వుబలాలతో తమ బలాన్ని జర్మనీపోల్చి చూసుకోలేదు ఈప్లానుకు వ్యతిరేకంగా, సోవియటు అవలంబించిన ఎదురుఎత్తు ఇది: స్టాలిన్ గ్రాడ్ సమీపంలో, జర్మనీ సైన్యాలను చుట్టుముట్టి హతమార్చడం. ఈ ప్లాను విజయవంతంగా సాగుతూంది. ఈప్లాను 3 దశలలోసాగింది. (1) నవంబరు 19 న, డాన్‌కు నైరుతినుండి, స్టాలిన్‌గ్రాడ్ రంగంనుండి ప్రారంభింపబడిన ఎదురుదాడి. ఇది జయప్రదంగా సాగి, 2 లక్షల మంది జర్మను సైన్యాలు (22 డివిజన్లు) చుట్టుముట్టబడ్డాయి. (2) రెండవది మధ్యడాన్ ప్రదేశం నుండి డిశంబరు 16వ తేదీన ప్రారంభమయినది. ఇది స్టాలిన్‌గ్రాడ్ ముందున్న జర్మనుసైన్యాల వెనుకభాగంలో చొచ్చుకు పోవడం అవిధంగా జర్మనుసైన్యాలకు సహాయంగాని, తప్పించుకొనుట గాని, అసంభవ మయ్యేటట్లు చేయడం. ఇదికూడ జయప్రదంగా ముగిసింది. (3) మూడవది డిశంబరు 12 వ తేదీన ప్రారంభమయింది స్టాలినుగ్రాడ్ వద్ద చుట్టుముట్టబడిన సైన్యాలకు సహాయంగా పోవాలని తుది ప్రయత్నం—విశ్వప్రయత్నం. చేసింది జర్మనీ. కొటిల్నికోవోకు ఉత్తరంగా, జర్మనీ తన బలాన్ని కేంద్రీకరించింది ఈ బలగాన్ని నాశనం చేయడం, జర్మన్లను దక్షిణభాగానికి తరమడం, అవిధంగా స్టాలిన్‌గ్రాడ్‌వద్ద చుట్టుముట్టబడిన తమ సైన్యాలలోకి చొచ్చుకుపోయే మరి అవకాశాన్ని జర్మన్లకు లేకుండా చేయడం, - ఇదీ సోవియటు సైనిక నాయకులు వాంఛించింది. అదే జరిగింది. జర్మను డివిజన్లు 6 నాశనమయ్యాయి. కొటిల్నికోవో కూడ సోవియటు వశమయింది.

## ఈ పది రోజులలో

ఇక, ఈ పది రోజులలో సోవియటు పొందిన విజయాలు చూద్దాం.

మధ్య రంగంలో వెలికియాలుకీ సోవియటు వశమయింది ఇది లాట్వియా సరిహద్దుకు 95 మైళ్ళలోను, స్మాలెన్‌స్కుకు 180 మైళ్ళదూర లోనువుంది. ఇది ముఖ్యమైన కీలక స్థానం. నెవెల్, నొవొసొకొల్నికిలకు ప్రమాదాన్ని హెచ్చించాయి.

స్టాలిన్‌గ్రాడ్ పట్టణంలో, రోజు రోజూ శత్రువుల నుండి భవనాలు స్వాధీనపరచుకుంటున్నాయి. అప్పుడే 100 కి 75 సోవియటు వశమయ్యాయి. వలయంలో బిగించబడిన జర్మన్ల పని ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

దిగువ డాన్‌నది ఒడ్డునవున్న నిమ్లాన్స్కాయా పట్టుబడింది డాన్, డానెట్జునది, కలిసేప్రదేశానికి సోవియటు సైన్యాలు సమీపించాయి. ఇంక 10 మైళ్ళ దూరంలోనే పై నదీసంగమంవుంది.

రొస్టావ్ వొరొనెజ్ రైల్వేను ఛేదించిన రష్యన్ సైన్యాలు మిల్లెరొవోను చుట్టుముట్టి, ఒక ప్రక్క వొరొషిలొవ్‌గ్రాడ్ సమీపాన వున్నాయి.

కొటిల్నికోవోను పట్టుకున్న రెడ్ఆర్మీ, స్టాలిన్‌గ్రాడ్ - నొవోరొసిస్క్ రైలుమార్గాన పురోగమించుతోంది. ఈ రైలు మార్గంలో రెండు ముఖ్య కేంద్రాలున్నాయి టిఖొరెట్స్క్. ఇక్కడనుండి రొస్టావుకు ఒక రైలు మార్గం వుంది సాల్స్కుకు కొటిల్నికోవోకు మధ్యనున్న జిమొవ్నికిని సోవియటు సైన్యాలు వశం చేసికొన్నాయి. సాల్స్కుకు 10 మైళ్ళలోకి సోవియటు సైన్యాలు వచ్చాయి. రెండవ ముఖ్యమైన జంక్షన్ టిఖొరెట్స్క్. ఇది రొస్టావ్ - బాకూ రైలు మార్గంలోవుంది. ఇక్కడ స్టాలిన్‌గ్రాడ్-నొవొరొసిస్క్ రైలుమార్గం కలుస్తుంది. ఇది వశమయితే, రొస్టావ్‌నుండి ఉత్తర కాకసస్‌లోని జర్మను సైన్యాలు విడిపోతాయి. అందుచేతనే ఆగ్నేయంనుండికూడ ఒక దాడి ప్రారంభమయింది. నాల్చిక్, మొజ్‌డాక్ ప్రాధాన్యాలను వశంచేసుకొన్న రెడ్ఆర్మీ, ఈ రైలుమార్గాన ముందుకు సాగుతోంది. ఈరైలుమార్గంలోనేవున్న ప్రొఖ్లాద్నయాకూడ వశమయింది.

వీటికి సహాయంగా, కాల్మిక్ రిపబ్లిక్ ముఖ్య పట్టణమైన ఎలిస్టా వశమయ్యాక, అటునుండికూడ ఒక దాడి ప్రారంభమయింది.

ఈ విధంగా, మధ్య రంగంలోను, మధ్య డాన్ నుండీ, కొటిల్నికోవోనుండి, ఎలిస్టానుండి, మొజ్‌డాక్ నుండి. సోవియటు ఎదురు దాడులు విజయవంతంగా సాగిపోతున్నాయి. ఇంతవరకు శత్రువు ఎచ్చటా నిలబడలేదు. ఒక కొసాక్ సైనికుడు చెప్పినట్లు "మా కత్తులపైని కొట్టు పుల నెత్తుటిని ఆరడానికి వ్యవధే లేదు. యుద్ధం అంత జోరుగా సాగుతోంది."

కామ్రేడ్
తుమ్మల వెంకటరామయ్య

## జర్మను ప్రగల్భాలు

వొరొనెజ్, స్టాలిన్‌గ్రాడ్, రొస్టావ్ మొజ్‌డాక్‌ల మధ్యనున్న 80 డివిజన్ల (12 లక్షల) సైన్యం ప్రమాదంలో చిక్కుకొని, హానిమయ్యే పరిస్థితులలో వున్నా, జర్మనీ ఫాసిస్టు మిలిటరీ నాయకులు నిజ విషయాలను తమ ప్రజలకు చెప్పడంలేదు హిట్లరు "శీతాకాలం తర్వాత మనం ముందుకు పోతాం; అపుడు ఒక రాజ్యం కూలిపోతుంది. ఆ కూలిపోయేది మాత్రం జర్మనీ కాదు. మరొకటి,"అన్నాడు. ఈప్రగల్భాలను సత్యమని నమ్మే స్థితిలో ఎవరూ లేరు. మాస్కో, స్టాలిన్‌గ్రాడ్ పతనాలు సంభవంలోనే యితని బండారం బయలుపడింది.

స్టాలిన్‌గ్రాడ్ ముందును, కాకాసస్‌లోను, రొస్టావ్-కొటిల్నికొవ్ - మిల్లెరోవ్ త్రికోణంలోను, చుట్టుముట్టబడిన జర్మను సైన్యాలను హతమార్చి యుక్రెయిను, డానెట్జును, రొస్టావును పునరాక్రమించుకోడానికి సోవియటు సైన్యాలు ముందుకు సాగుతాయి. ఇ క్కన్లు ప్రతిఘటించవచ్చు. కాని, సోవియటు సైన్యాలను సాధించే అవకాశం వుంది.

## జర్మనీ నష్టాలు

నవంబరు 19 నుండి - డిశంబరు 31 లోగా, రెడ్ ఆర్మీ 22 జర్మను డివిజన్లను చుట్టు ముట్టించి, 36 డివిజన్లను నాశనం చేసింది. ఇందులో 6 టాంకు డివిజన్లు. మరి 7 డివిజన్లకు విపరీత నష్టాలు కలిగించింది.

| | పట్టుబడిన | నాశనం చేయబడ్డ |
|---|---|---|
| జర్మనీ ఆఫీసర్లు, మనుష్యులు | 175,000 | 137,650 |
| విమానాలు | 542 | 1249 |
| టాంకులు | 2064 | 1187 |
| ఫిరంగులు | 4451 | 1459 |
| మిషన్ గన్‌లు | 8161 | 2708 |

## ఆక్రమిత యూరప్

హిట్లరు తన అపజయాలను దాచలేడు. ఆక్రమిత యూరప్‌లోని అసహనం రోజురోజుకూ ఎక్కువ అవుతుంది. యుగోస్లేవియాలో కొత్త సైన్యాలు తిరుగుబాట్ల నణచడానికి పంపబడ్డాయి. ఇన్లెడియాలో 25 వేల కమ్యూనిస్టులు అరెస్టు చేయబడినట్లు వార్త. జకోస్లొవేకియాలో 1942 లో 1940 మంది ఉరి తీయబడ్డారు ఇందులో 137 గురు స్త్రీలు. ఫ్రాన్సులో కమ్యూనిస్టులపై, డీగాలీ అనుచరులపై, లావల్ ద్వజమెత్తాడు. నార్వే, గ్రీసు, పోలెండులలోని జర్మను దుశ్చర్యలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఇదివరలో జినోవా, ట్యూరిన్, మిలాన్ (ఇటలీ) లలో యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగినట్లు మాస్కో రేడియో ప్రకటించింది. ఇపుడు రుమేనియాలో జరుగుతున్నట్లు తెల్పుతోంది.

## రెండవరంగం

ఇలాంటి సమయంలో రెండవరంగం తెరవటం మంచి అవకాశం కాని దానికి ముందు ఆఫ్రికారంగం ... వాన, బురద, సప్లయిమార్గాలు. అంటూ ఏవో సాకులు చెబుతున్నారు రష్యాలోని మంచుకంటె ఇది ఎక్కువా? వారెలా విజయాలను సాధించ గల్గుతున్నారు. సామ్రాజ్యవాదుల పెట్టే సాకుల కర్ధంలేదు. సామ్రాజ్యవాదుల భయం, ఇటలీ ఫ్రాన్సులలో విప్లవాలు వస్తాయనే పెటాన్‌కు బదులు డార్లానును కోరినట్లే, ముస్సోలినీకి బదులు కొందరు ఇటలీ మిలటరీ నాయకులకు. స్పెయినులో కొందరు మోనార్కిస్టు(రాచవంశీకు) లకు పట్టాభిషేకంగట్టాలని వాంఛిస్తున్నారు ఈ అభివృద్ధి నిరోధకులు. డార్లాను చచ్చినా, డార్లాను తత్వం చావలేదు. జీరో - డీగాలీలమధ్య పైకి కన్పడే విభేదాలన్నీ, చర్చలన్నీ, ఫ్రెంచి సామ్రాజ్యవిభజనను గురించే కాని ఫ్రెంచి వలసప్రజల విముక్తిని గురించికాదు. "న్యూయార్కు వరల్డ్ టెలిగ్రాం" పత్రికవిలేఖరి, ఇంకా ఫ్రెంచి ఆఫ్రికాలో, చిన్నచిన్న పదవులలో ఫాసిస్టుతమూకలు ఎందరో వున్నారని వ్రాశాడు. అందుచేత, డీగాలీ - జీరోల మైత్రినేగాదు వాంఛింపవలసింది. ఫ్రెంచి వలస ప్రజలకువిముక్తి, తద్వారా ఫ్రెంచి రిపబ్లికుకు శృంఖలా విచ్ఛేదం కల్గించాలి.

---

**19 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ**

**కాకినాడ**

★

**ఫిబ్రవరి 6, 7, 8 లలో**

★

అధ్యక్షులు:

కామ్రేడ్ పెరిన్ బరూచా,

అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్

కార్యదర్శి.

---



# కార్మిక లోకం

రాజకీయాలు, సంఘసమస్యలు, ఎలా ఒక దానితో ఒకటి పెనవేసుకొని వుంటాయో ఈ రోజుల్లో ప్రజలకు స్పష్టమవుతూంది. ఇప్పుడు దేశాన్ని ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో రెండు — జపాను ఫాసిస్టుల ప్రమాదం అహారపదార్థాల కరువు ఆహార పదార్థాల సమస్య సహకారంయొక్క నిత్యజీవనానికి సంబంధించింది. అయినప్పటికి, జపాన్ ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కోవడం, నేడు ఈ ఆహార పదార్థాల సమస్యను పరిష్కరించడంమీద ఆధారపడి వుంది. ఈ రెండూ సక్రమంగా జరగడానికి బ్రిటిష్ సామ్రాజ్య ప్రభుత్వం దాని చేతిక్రిందవున్న అధికార వర్గాలు ఎడతెగని అంతరాయాలు కలిగిస్తూవున్నాయి. జాతీయ ప్రభుత్వం ఏర్పడితేనేగాని సమాజంయొక్క దైనందిన సమస్యలు సాఫీగా పరిష్కారం కావడం, శత్రువులను జయప్రదంగా ఎదుర్కోవడం, జరగనేరదని నానాటికి రూఢి అవుతూంది. ఐక్యతద్వారానే, ప్రజా సంఘటిత శక్తిద్వారానే, దైనందిన సమస్యలను పరిష్కరించుకోవడమూ, జాతీయ ప్రభుత్వాన్ని సాధించడమూ జరుగుతుందని నానాటికి విశదమవుతూంది. ఉదాహరణకు ఈ దిగువ సంఘటనలు చూడండి.

మలబారులో "కొజికోడు" అనే పట్టణంలో, వర్తకుడు, మొగుమతి చేయటానికి, బియ్యాన్ని దొంగతనంగా తీసుకుపోతుంటే, 30 మంది వలంటీర్లు చుట్టుముట్టి బళ్ళను ఆపివేశారు. తిండిలేక అవస్థల్లో వున్న స్థానికం కూడా బళ్ళచుట్టూ మూగారు. వెంటనే వలంటీర్లు, ప్రజలను అర్ధరులో కూర్చోపెట్టి, కంట్రోలుధరల కందరికీ బియ్యం యిప్పించారు.

బెంగాలులో బారిసాల్ జిల్లాలో, ప్రజలు బియ్యం దొరక్క అవస్థ పడుతుంటే, ఒకవర్తకుడు 1000 మణుగుల బియ్యం రహస్యంగా బోటు మీద మరో చోటికి తీసుకుపోతున్నారు. ఇది కనిపెట్టి, ప్రజా రక్షణ సమితిలోని వలంటీర్లు బోటును అడ్డగించి ఆసరుకంతా కంట్రోలుధరలకు అందరికీ పంచిపెట్టారు.

పుంగనూరు యూనియన్ పంచాయతీ బోర్డు పనివారలకు, స్పెషల్ ఆఫీసరు వున్నప్పుడు, యుద్ధ అలవెన్సు 4-0-0 ఇచ్చేవారు. అతనుపోయి, నవంబరులో టెంపరరీ ప్రెసిడెంటుగారు వచ్చిన తరువాత యుద్ధ అలవెన్సు ఇవ్వడం మానివేశారు. ఇది ఎంత అక్రమమో, ఇలాంటి చర్యలవల్ల యుద్ధనిర్వాహణకు ఎలా అంతరాయం వస్తుందో పనివారు ఎంత చెప్పినా లాభంలేకపోయింది. పనివారు సమ్మెచేయక తప్పింది కాదు. 5-12-42 న సమ్మె జరిగింది. ఒక్క దినం సమ్మెకే ఆయన దిగివచ్చారు. కార్మికుల కోరిక నెరవేరింది.

ఐక్య సంఘటిత శక్తితో అన్నీ సాధ్యమే.

## రైల్వే కార్మికుల ఐక్య కృషి

యం. యస్. యం. రైల్వే పనివారల సంఘకేంద్ర కార్యనిర్వాహకవర్గం నిర్ణయించిన ప్రకారం (30 వ తేదీ ప్రజాశక్తి చూడండి) రైల్వే కార్మికులు అనేక ప్రాంతాల్లో యుద్ధఅలవెన్సు, రేషన్సు అలవెన్సువారం చాల ఉత్సాహ, ఉద్రేకాలతో జరిపారు.

గుంతకల్ బ్రాంచి యాజమాన్యాన బ్రాడ్‌గేజి, మీటర్‌గేజి, కల్లూరు, ద్రోణాచలం పెనుకొండలలో సభలు జరిగాయి. బెజవాడ బ్రాంచివారు మాచవరం, తాడేపల్లి, బెజవాడలలో ఈ వారం జరిపారు. గుత్తి, హాస్పేట, గూడూరు, చిట్టగుంట మొదలయినచోట్ల మహాసభలు జరిగాయి. కార్మికులు వందలవేలుగ పాల్గొన్నారు. ఈసభల్లోను, గ్రూపు మీటింగులలోను, కేంద్ర కమిటి చేసిన తీర్మానాలను వివరించారు. కార్మికులు ఐక్యతద్వారానే తమ కష్టాలను పోగొట్టుకొని, కోర్కెలను సాధించగలరని తెలియజేశారు.

దేశరక్షణ విషయంలో రైల్వే కార్మికుల బాధ్యతను జ్ఞాపకపరిచారు. యుద్ధ నిర్వాహణకు అన్ని విధాలా తోడ్పడవలసిన నైజాం, మద్రాసు ప్రభుత్వాలు, కార్మికుల విశ్వాసాన్ని చూరగొన్న నాయకులను అరెస్టు చేస్తూ, అంతిమ విజయానికి ఆటంకం కలిగించడాన్ని కార్మికులు తీవ్రంగా ఖండించారు. ఇకనయినా వీరు చేసిన తప్పును దిద్దుకొని, కార్మిక నాయకులను విడుదలచేసి, కార్మికుల న్యాయసమ్మతమైన కోర్కెలను నెరవేర్చి, ఆ విధంగా మిత్రరాజ్యాల విజయాన్ని త్వరపరచవలసిందని హెచ్చరించారు. కేంద్ర కమిటీ తీర్మానాలను ఆమోదిస్తూ, రెండువందల రూపాయిల వరకు జీతంవున్నవారికి వెంటనే 20 రూపాయిల యుద్ధ అలవెన్సులు ఇప్పించాలనీ, రైల్వే సిబ్బంది అంతటినీ మిలటరీ యూనిట్లలోచేర్చి, రేషన్లు ఇవ్వడంలో జాతిభేదాన్ని పాటించకూడదనీ రైల్వే బోర్డును కోరారు. ఆహారపదార్థాల డిపోలను విరివిగా ఏర్పాటు చేయాలని, ఓపెన్‌లైన్ కార్మికులకు ప్రావిజన్ ప్యాసులు ఇవ్వాలని కోరారు. ఆ పైని ప్రతి ప్రాంతంలోని ప్రత్యేక సమస్యలను గురించి చర్చలు, తీర్మానాలు జరిగాయి.

ఇప్పటి యుద్ధ వ్యూహంలో రైల్వే కార్మికులు తమస్థానాన్ని, తమబాధ్యతల్ని గుర్తించాదనేచెప్పాలి. ఈ బాధ్యతను నెరవేర్చుకోడానికి వారు ఐక్య సంఘటిత శక్తిని నిర్మించుకొంటున్నారు వారు తప్పక విజయం పొందగలరు.

## ఎడతెగని ఆందోళన

కాకినాడలో ఈ నెల మొదటి తేదీన పాకీపనివాళ్ల జనరల్‌బాడీ మీటింగు జరిగింది. బియ్యం మొదలైన వాటి ధరలు విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితులలో, అక్టోబరునుంచి ఇస్తున్న 4-8-0 యుద్ధ అలవెన్సు చాలకుండా వుంది. కాబట్టి, ఇప్పటి ధరలకు తగినట్లు అలవెన్సును 8-12-0 పెంచవలసిందని సభవారు కోరారు. మునిసిపల్ ఆవరణలోనే చౌక డిపోలు స్థాపించాలన్నారు. ఇద్దరు చేయవలసిన పనిని ఒక్కరికే అప్పగించి, చాలమంది నిరుద్యోగానికి కారకులవుతున్న అధికారుల చర్యలను ఖండించారు. ఈ పద్ధతిని ఇక మానుకొని నిరుద్యోగులైనవారికి పనులు కలిగించాలని కోరారు.

తెనాలిలో మునిసిపల్ అధికారుల ప్రవర్తన చాల ఖండించ తగినదిగా వుంది. ప్రభుత్వం ఆగష్టు నెలలోనే నాలుగు రూపాయిల యుద్ధ అలవెన్సు శాంక్షన్ చేస్తే, మునిసిపల్ అధికారులు మూడు రూపాయిలు మాత్రమే ఇచ్చారు. ఇది అక్రమమని, వెంటనే మిగతా ఒక రూపాయి ఇప్పించాలని, మొన్న మూడవ తేదీన తెనాలిలో జరిగిన మునిసిపల్ పనివాళ్ళ సభలో తీర్మానం జరిగింది. ధరలు పెరిగిపోయిన ఈ రోజుల్లో నాలుగు రూపాయిల అలవెన్సు చాలదనీ, ప్రభుత్వం రైల్వేపనివాళ్ళకు ఇప్పిస్తున్నట్లుగానే తమకు కూడా 8-12-0 అలవెన్సు ఇప్పించాలని కోరారు. మునిసిపల్ ఆవరణలోనే చౌకడిపోలు పెట్టించాలన్నారు.

నూజివీడులో కూడా గత మాసం జరిగిన యో తేదీని పంచాయితీబోర్డు పనివారు సమావేశమై, యుద్ధ అలవెన్సులను గురించి, ఇతర ఇబ్బందుల్ని గురించి తీర్మానాలు చేశారు.

బెజవాడ మునిసిపల్ పనివారల స్థితి చాల దుర్భరంగా వుంది. తమ అధిక ధరల అలవెన్సు విషయమై ప్రభుత్వం వెంటనే తగిన చర్య తీసుకోవాలి, లేకపోతే సమ్మెచేయడం తప్ప వేరేమార్గం లేదనే భావం వీరిలో నాటుకపోతూంది. ఈవిషయం ప్రభుత్వానికి తెలియచేస్తూ పోయిన నెలలో ఒక తంతివార్త పంపారు.

ఇతర కార్మికవర్గాల్లో కూడా యుద్ధ అలవెన్సు, సరకుల సప్లయి మొదలయిన సమస్యలను గురించి ఆందోళన అధికంగా వుంది.

కొన్ని మైకా గనులలో, యుద్ధానికి ముందున్న కూలీ రేట్లే ఇప్పటికూడా ఇస్తున్నారు. ఇది ఎంత దారుణమో వేరే చెప్ప నక్కర్లేదు. ఈ మధ్య గూడూరు మైకావర్కర్సుయూనియన్ కార్యనిర్వాహకవర్గంసమావేశమై ఈవిషయాన్ని తీవ్రంగా విమర్శించి కూలీరేటును నూటికి యాభై చొప్పున హెచ్చించాలన్నారు.

ఈదశలో ఉప్పుపనివాళ్లలో నూటికి 75 మందికి నెల జీతం పదిరూపాయిలో, అంతకన్న తక్కువో, దీనితోనే, ఈరోజుల్లోకూడా కుటుంబపోషణ జరగాలి. మానవ మాత్రుడికి దీది సాధ్యమవుతుందని ఎవరన గలరు! యజమానుల దృష్టిలో ఈ కార్మికులు మానవులు కారేమో! తమ ఇబ్బందుల్ని వివరిస్తూ, నెలకు 15 రూపాయిలు, అంతకు తక్కువ జీతం వున్నవారికి మూడురూపాయిలు, 10 రూపాయిలు, అంతకు ఎక్కువ వున్నవారికి రెండు రూపాయిలు, చొప్పున ధరలు తగ్గేవరకు ప్రతి నెల ఇప్పించాలని కోరుతూ, కార్మికులంతా సంతకాలుపెట్టి, లేబరు కమీషనరుకి, కలెక్టరుకి, మెమోరాండం పంపారు.

ఈ నాడు కూడా, జీవితావసరాల కోసం కార్మికులు ఇంత ఆందోళన సాగిస్తున్నరంటే ఇప్పటి అధికార వర్గాలు ఎంత బాధ్యతా రహితంగా పనిచేస్తున్నారో విశద మవుతూవుంది.

## ఘోర దురంతాలు

ఈ మధ్య హాస్పేట ప్రాంతంలో, కంచి బాలప్ప అనేరైల్వే గాంగ్‌మేన్‌కి రాత్రి కాపలా వంతువచ్చింది. కాని, అక్కడి పి డబ్ల్యు. డి. ఇన్‌స్పెక్టరు కిరసనాయిలు ఇవ్వ నిరాకరించడంవల్ల పాపం బాలప్పదీపం లేకుండా పనిచేయవలసివచ్చి, చీకటిలో ప్రమాదవశాన గుర్పుబండి క్రిందపడిచనిపోయాడు అధికారదురహంకారంఎంత దూరం పోతు దో చూడండి! అంతటితో ఆగ లేదు బాలప్ప కుటుంబానికి ఇంతవరకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదు. ఈ పి డబ్ల్యు. డి. ఇన్‌స్పెక్టరు, బియ్యం కొనుక్కోడానికి పోవడంవల్ల ఒకపూట పనిలోనికి రాలేకపోయిన వారిని మరి పనిలోకి రానీయడంలేదట. పనివారికి కూడా ప్రాణాలుంటాయి, వారి ఆకలి మంటలకు కూడా ఇంతఆహారం అవసరం అనే విషయాన్నయినా గుర్తించ లేని ఇలాంటి అధికారుల బారినుండి కార్మికులను కాపాడడం చాలా అవసరం, ఉన్నతాధికారులు ఈ విషయమై వెంటనే తగిన చర్య తీసుకోవాలి.

గూడూరుకు 12 మైళ్ళ దూరంలో వున్న "వోరుపల్లి జయలక్ష్మి" మైకా గనిలో, మొన్న ఏడవతేదీ సాయంత్రం మూడు గంటలప్పుడు. ఒక పాత తోటా పేల డంవల్ల, వీరయ్య అనేపనివాడు వెంటనేచనిపోయాడు. మరి ఇద్దరు కూలీలకు గట్టి దెబ్బలు తగిలాయి. వారిని హాస్పిటలు తీసుకువెళ్లారు అక్కడవారిలో ఒకతను చనిపోయాడు. చనిపోయిన వారిలో వీరయ్య కింకా పెండ్లికాలేదు. రెండో అతనికి పెండ్లయి రెండు మాసాలే అయింది. దెబ్బలు తినవున్నతనికి భార్య, ఒక బిడ్డ వున్నారు. గని యజమానులు అశ్రద్ధచేయక అన్ని విషయాల్లోనూ న్యాయంగా ప్రవర్తించారట. కాని ఇది చాలదు. ఇటీవల ఒక మైకాగనిలో నిచ్చెన మీదనుంచి పడి ఒక కూలీ చనిపోయాడు. ఇకమీదట ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టాలు చేయాలి.

## ధొరవారు

ఈమధ్య ఒకనాడు, పాకాల రైల్వే లోకోషెడ్డులో పనిచేస్తున్న అహమద్‌గారు హ్యాటువేసుకొని రావడం చూసి ఫోర్‌మన్ వాలర్ కన్నుకట్టుకున్నాడు 'దొరలు వేసుకొనే హ్యాటు నువ్వు వేసుకుంటావా!' అని. హ్యాటును లాగుకొని కొలిమిలోకి విసిరాడు. అక్కడ రైల్వే కార్మికులు సభజరిపి, ఈ 'దొరవారి' చర్యను యెలా గౌరవించాలో అలా గౌరవించారు. ఆ సభలో రైల్వే కార్మికులకు యుద్ధ అలవెన్సులు యెక్కువ చేయవలసిందనీ, చౌక డిపోలు యేర్పాటు చేయవలసిందనీ కోరారు. ఎక్కువ అలవెన్సు ఇవ్వాలనీ, బోనుల పద్ధతిని తొలగించాలనీ కోరుతూ 240 సంతకాలతో, రైల్వే బోర్డుకి, యేజంటుకి, యూనియన్ అధ్యక్షునికి మహజర్లు పంపారు.

(5 వ పేజీ తరువాయి) తెచ్చిగొట్టాడు. మరునాడు స్థానిక పార్టీ కామ్రేడ్సు రైతుల్ని - కూలీలను శాంత పరిచారు. 50 మంది కూలీలు సమనులపై తెనాలి కోర్టుకు రప్పించబడ్డారు. రాజీకి 4 రోజుల గడువు యివ్వబడింది. కాని, అన్ని బంజరు భూములపై 144 వ సెక్షన్ జారీ చేశారు. పరిస్థితులు విషమించేటట్లున్నాయి. రైతు ప్రముఖు లేసురత్నాన్ని కూలీలు చంపివేసే షరతుపై రైతులకు - కూలీలకు మధ్య ఐక్యత కుదిరింది. ఈనాముకు సంబంధించినంతవరకు కూలీలు రు. 52 లుసూ, సీటీధరువయునూ, పంచాయతీబోర్డుకు చెల్లించే పద్ధతిని తగాదా పరిష్కారమయింది.

## వివిధ ప్రాంతాంలో మహిళల కార్యనిరతి

గుంటూరు జిల్లాలో మహిళా ఉద్యమాన్ని పెంపొందించటానికి చక్కటి ప్రచారం కొనసాగింపబడుతోంది, మంచికలపూడి, దావులూరు, అనంతవరం, కొల్లూరు, జాగర్లమూడి, అమర్తలూరు, చినపాలెం, కుమ్మరపాలెం, కాశిప, గ్రామాల్లో బహిరంగసభల ద్వారానూ. బుర్రకథల ద్వారాను, మహిళాసంఘాల ఆశ్యకతనుగూర్చి స్త్రీలలో నవోత్సాహం రేకెత్తించబడింది. సుమారు 6 వందలమంది సభలకు హాజరయ్యారు. 450 మంది మహిళా సంఘాల్లో సభ్యులైరి.

భారత నారీమణుల ప్రాణ మానాలను జపాను ఫాసిస్టుల బారినుండి రక్షించటానికి వీలగు కార్యక్రమంతో పనిచేయుచున్న కమ్యూనిస్టుపార్టీ నిధికి యెంతో ఆప్యాయంగా నలభై రూపాయిలను, రెండు బంగారు ఉంగరాలను విరాళ మిచ్చారు.

### రాజమండ్రి

రాజమండ్రి మునిసిపల్ పనివారల మహిళా సమావేశం జనవరి 1 వ తారీకున కామ్రేడ్ యల్. వి. రత్నమ్మ అధ్యక్షతను జరిగింది. వందమంది కార్మిక స్త్రీలు సమావేశానికి హాజరయ్యారు ఆ సమావేశంలో స్త్రీలకుకూడా పురుషులతోపాటు సమానమైన కూలి యివ్వాలనీ, బహు భార్యా నిషేధ చట్టాన్ని యేర్పాటు చెయ్యాలనీ గర్భిణీ స్త్రీలకు ప్రసవించే ముందూ, ప్రసవించిన తర్వాత రెండు నెలలు పూర్తి జీతంమీద సెలవివ్వాలనీ, ప్రసూతి వైద్య సౌకర్యాలు యేర్పాటు చేయాలనీ తీర్మానించారు. విమానదాడి రక్షణకై సరియైన ట్రెంచిలు వగైరా యేర్పాట్లు చేయాలనీ, చౌక డిపోలను యేర్పర్చాలనీ, కూలీ పేటల సమీపంలో ఉండే కల్లంగడులను తీసివేయించాలనీ, తమ కోర్కెలను వెలిబుచ్చారు. చెన్నా ఎల్లమ్మగారిని అధ్యక్షురాలుగను, ముత్యాల పాపమ్మగారిని కార్యదర్శిగను యెన్నుకున్నారు.

### కాకినాడ

కాకినాడలో సిటీ మహిళా సంఘం సమావేశమై, ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండించుచు, ఫాసిస్టు వ్యతిరేక ప్రజా సంఘటనకై జాతీయ నాయకులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతి పేటలోను చౌక డిపోలను యేర్పాటు చేయమని కోరారు 'బి. యన్. రావు కమిటీ రిపోర్టులో అవసరమైన సవరణలుచేసి వెంటనే చట్టరూపంగా అమలు పర్చమని ప్రభుత్వాన్ని కోరారు.

### జనార్దనపురం గ్రామ మహిళా సంఘం

డిసెంబరు 29 వ తారీఖున. కామ్రేడ్ చంద్రి సావిత్రీదేవి అధ్యక్షతను జనార్దనపురం గ్రామ మహిళా సంఘ వార్షికోత్సవం జరిగింది. 150 మంది స్త్రీలు సమావేశానికి హాజరయ్యారు. సావిత్రిదేవి, జానకి పాల్‌గార్లు, మహిళా సంఘాల ఆవశ్యకతనుగురించి, భారత దేశంలోని స్త్రీలకు రానున్న ఫాసిస్టు ప్రమాదం నుండి సంరక్షించుకోటానికి భారత నారీలోకంయొక్క కర్తవ్యాన్ని గురించి, ఉపన్యసించారు.

### బుద్ధవరం మహిళా సంఘం

డిసెంబరు 27 వ తారీఖున బుద్ధవరం గ్రామ మహిళల సమావేశం జరిగింది. వెల్లంకి అన్నపూర్ణదేవి, యలమంచిలి కమలగార్లు, స్త్రీ సంఘాల అవసరాన్ని గురించీ, స్త్రీ కర్తవ్యాన్ని గురించీ, ఉపన్యసించారు. గ్రామ మహిళా సంఘానికి ముక్కామల లక్ష్మీనరసమ్మగారిని ప్రెసిడెంటుగాను, చింతపల్లి పుష్పవతిగారిని సెక్రటరీగానూ ఎన్నుకొనిరి.

# "ఆకలిమంటచె మలమలమాడే అనాధులంతా లేవండోయ్"

ఇదివరకెన్నడూ కనివిని ఎరుగనటువంటి కరువు నేడు మన దేశమంతటా తాండవమాడుతోంది. లక్షలాది ప్రజలు ఆకలిబాధతో అలమటించిపోతున్నారు. ఏ ప్రాంతంలో చూచినా "ఆకలి, ఆకలి, ఆకలి" అనే ఆర్త నినాదాలే ప్రతిధ్వనిస్తున్నాయి. ఆహారపదార్థాలను సంపాదించటంకోసం బీదప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. తిండికోసం తహతహలాడుతూ, చౌకధరల డిపోలవద్ద వందలకొద్ది స్త్రీలు, పిల్లలు, రాత్రిళ్ళుకూడా, గుంపులు గుంపులుగా పడిగాపులు పడి యుంటున్నారు. బొంబాయిలో యీ విధంగా పడిగాపులు కాస్తున్న ఒక గర్భిణీ స్త్రీ డిపోవద్దనే ప్రసవించింది. మరొక చిన్న పిల్ల గుంపుల వత్తిడిలో నలిగి, స్పృహతప్పి పడిపోయింది. ఇన్ని అవస్థలుపడుతూ, తిండికోసం త్రొక్కిసలాడుకొంటున్న బీదప్రజలు పోలీసుల లాఠీప్రహారాలకు కూడా గురికావల్సి వస్తోంది.

## దుస్సహాపరిస్థితులు

ఇదే పరిస్థితి నేడు ఏ పట్టణంలో చూచినా ప్రత్యక్షమౌతుంది ఇంతేకాదు. దైనందినావసరమైన ప్రతి వస్తువుకు కూడ ధరలు విపరీతంగా పెరిగిపోవటంవల్ల, కొన్నిచోట్ల అసలే దొరక్కపోవటంవల్ల, దోపిడీలు కూడ ప్రారంభమయ్యాయి. బొంబాయిలో ఒకగుంపు 6 షాపుల్ని లూటీచేసి, నెయ్యి, నూనె, బెల్లం, పప్పు, వగైరాలను కొల్లగొట్టారు. కలకత్తాలో ఒక కోమటి దుకాణాన్ని దోచుకోవాలని గుంపులు గుంపులుగా జనం గుమికూడితే పోలీసులు కాల్పులు కాల్చారు.

మనఆంధ్రదేశంలోకూడ అనేకచోట్ల ఆహారపదార్థాలకు కరువు ఏర్పడింది. రాయలసీమలో అసలే ఆహారపదార్థాలు దొరక్క అలమటించిపోతూ, భయంకరమైన క్షామ పరిస్థితులకు గురిఅౌతున్నారు. కర్నూలుజిల్లా, కోయిలకుంట్ల తాలూకాలో సంచారంచేసిన క్షామనివారణ సంఘసభ్యులు, క్షామపరిస్థితిగురించి ప్రకటిస్తూ, ఇంచుమించు తాలూకాలోని అన్ని గ్రామాల్లోనూ ఘోరమైన కరువు వ్యాపించిందనీ, షుమారు 40 వేల యకరాల్లో పంటలుపాడైపోయాయనీ తెలియజేశారు. ఈ కరువుమూలంగా సుమారు 10 వేల కూలీలు, చిన్న రైతులు, తిండిలేక అల్లాడిపోతున్నారనీ. రెండువేలమంది, ఇళ్లూవాకిళ్ళూ వదలి, చుట్టుప్రక్కల తాలూకాల్లోని కెనాల్ ప్రదేశాల్లో పనులుచేసికోడానికి వెళ్ళారనీ, పశువులకు అసలే గ్రాసంలేదనీకూడ తమ ప్రకటనలో వెలిబుచ్చారు.

రేపల్లెలో విస్సుపెట్టెలూ, పంచదార, కిరసనాయిలు చాలరోజులనుంచి మార్కెటులో కన్పడటంలేదు.

నంద్యాల ప్రాంతాలలో పంటమీద ఉన్న జొన్నచేలల్లోకిపోయి రాత్రులందు ఎవరో దొంగతనంగా జొన్నకంకులు కోసుకుపోతున్నారు.

మలబారులోకూడ అనేకచోట్ల ఇదేపరిస్థితి కన్పడుతోంది. రోజుకు 140, 150 బస్తాల బియ్యమమ్మే డిపోలలో, సప్లయిలేక 90 బస్తాలే అమ్ముతున్నారు. ధాన్యంలేకపోవటంవల్ల అనేక మిల్లుల్ని మూసివేశారు. బియ్యందొరక్క కొన్ని కొన్ని పట్టణాల్లో హోటళ్ళనుకూడా మూసివేస్తున్నారు.

## వర్తకుల విపరీత దోపిడి

ఒకవంక యీవిధంగా ప్రజాసామాన్యం ఇబ్బందులు పడుతుంటే — మరోవంక వర్తకులు విపరీత లాభాలకోసం ఆహారపదార్థాలను నిల్వచేస్తున్నారు. బియ్యాన్నీ, ధాన్యాన్ని నిల్వచేసినందుకుగాను బొంబాయిలో 77 టోకు వ్యాపారసంస్థలను ప్రభుత్వం స్వాధీనంచేసికొంది. కొంతమంది వద్ద గోధుమల స్టాకుని కూడా పట్టపర్చుకున్నారు. తిండిలేక మాడిపోతున్న రాయలసీమలోని నంద్యాలలో, వర్తకుల నిల్వపోతకొట్లను సోదాచేసి, 55 బస్తాలజొన్నల్ని స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురంలో 21 డబ్బాల కిర్సనాయిలు పట్టుకున్నారు. పాలకొల్లులో షుమారు పదివేలరూపాయల ఖరీదుగల పప్పుదినుసుల్ని స్వాధీనంచేసుకున్నారు. నర్సాపురంలో 15 వేల బియ్యం బస్తాలను నిల్వచేసి వ్యాపారం సాగిస్తున్న వర్తకునివద్ద స్టాకు స్వాధీనం చేసికొని కేసుపెట్టారు. కర్నూలులో పంచదారలేక ప్రజలు అవస్థపడుతుంటే, యీనెల ఒకటో తేదీన 90 బస్తాల పంచదార వివిధవర్తకులకూ పంచియిచ్చారు. ఎవరికైతే పంచదార అమ్మకానికివ్వబడిందో, ఆషాపుల్లోకి వెంటనే వెళ్ళి పంచదారయిమ్మని అడిగితే "అయిపోయింది" అనే సమాధానమే ప్రతిచోటా వినవచ్చింది. 90 బస్తాల పంచదార ఏమైంది? మార్కెటులో పంచదారకు గిరాకీఉందని తెలిసి, అధిక లాభాలను గుంజటంకోసం వర్తకులు దాచిపెట్టారు. ఇదే విధంగా ప్రతిచోటాకూడా వేలకొలది ప్రజలు తిండిలేక చచ్చిపోతున్నాసరే, లాభాలను సంపాదించడంకోసం, ప్రజలకు అందకుండానే తిండిదొంగలైన వర్తకులు సరుకంతా తమపొట్టన పెట్టుకుంటున్నారు.

## ఎదురెత్తులు

ప్రభుత్వంచే నిర్ణయించబడ్డ కంట్రోలు ధరలు నామమాత్రంగానే ఉన్నాయికాని, ఎక్కడా కూడ బజారులో అమలు జరగటంలేదు. మలబారులో బియ్యానికీ, మొక్కజొన్నలకూ ధరలు కంట్రోలుచేస్తే, యీరెండూ మార్కెటునుండి అంతర్ధానమయిపోయాయి. ధాన్యాన్నీ, మొక్కజొన్నలనూ ఎగుమతి చేయగూడదని కూడా కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం నిషేధించింది. అందుకని ధాన్యాన్ని బియ్యంగానూ, మొక్కజొన్నల్ని పిండిగానూ మార్చి, ఎగుమతి చేస్తున్నారు. ధాన్యానికీ మొక్కజొన్నలకీ నిషేధముందికాని బియ్యానికీ, పిండికీ నిషేధంలేదు. కంట్రోలు రేటుకంటే 4, 5 రెట్లు అదనంగా యిస్తే బియ్యమూ మొక్కజొన్నలు కూడా సప్లయి చేస్తున్నారు.

## ప్రభుత్వ అసమర్థత

ఇలాగే ప్రతిచోటా ప్రభుత్వ మవలంబిస్తున్న పద్ధతులు ప్రజలకు బొత్తిగా వుపయోగపడకుండా పోతున్నాయి. ఎందువల్ల యీసంక్షోభం యింత తీవ్రరూపం దాల్చింది? దీనిని పరిష్కరించట మెలాగ? అనే సమస్యే నేడు ప్రతివాడిని ఎదుర్కొంటోంది.

భారతప్రభుత్వ, ట్రాన్స్‌పోర్టు సభ్యుడు సర్ ఎడ్వర్డు బెంథాల్, డిసెంబరు 21 వ తారీఖున మద్రాసులో ఉపన్యసిస్తూ ఆహారపదార్థాల పంపకంలోని అసమానతవల్ల, సరుకులను నిల్వచేయుటవల్లనే యీ సంక్షోభం కల్గుతోంది కాని, రవాణాసౌకర్యాల కొరతవల్ల కాదని చెప్పాడు. ఇకముందు రవాణాసౌకర్యాలు కూడా సరిగా ఉంటాయన్నాడు. (ఇప్పుడు సరిగాలేవన్న మాటేగా!)

## ప్రభుత్వ వైఖరి

భారత ప్రభుత్వ వాణిజ్యసభ్యుడు నలినరంజన్ సర్కారు, జనవరి 6 వ తారీఖున కలకత్తాలో మాట్లాడుతూ, మనదేశంలో ఇప్పుడు ఆహారసమస్య తీవ్రరూపం దాల్చి ప్రజలు త్రొక్కిసలాడుకోడానికి కారణం సరకు రవాణాసౌకర్యాలులేక ధరలు పెరగటమేనని చెప్పాడు.

ఈ యిరువురి ప్రభుత్వసభ్యుల వాదనలకూ పరస్పర వైరుధ్యం స్పష్టంగా కన్పడుతోంది. సరుకుల పంపకంలోని అసమానత, సరుకులు నిల్వచేయుట, కరువుకు కారణమని బెంథాల్ చెప్పితే, రాకపోకల సౌకర్యాలు సరిగా లేకపోవడంవల్ల సంక్షోభం కల్గిందని నలినరంజన సర్కారు చెపుతున్నాడు. ఈ రెండు వాదనలూ పొసగకపోయినా — నేటి సంక్షోభానికి ఇద్దరు చెప్పినవీ కూడ కొంతవరకు కారణాలే.

అయితే వీటిని సాధించటానికి ప్రభుత్వం ఏంచేసింది? ఏం చేస్తోంది? ఈ నిరంకుశ ప్రభుత్వానికి ఏం చెయ్యటమూ చేతకాదే నలినరంజన్ సర్కారు మొన్న కలకత్తాలో మాట్లాడుతూ, మార్చి వరకూ వేచియుండమంటున్నాడు. ప్రభుత్వం వేచియుంటే ఉండవచ్చును కాని, ఆకలిమంటలలో అలమటించి పోతున్న ప్రజానీకపు ప్రాణాలు వేచియుంటయ్యా? లేదు. రవాణాసౌకర్యాలు సరిగా లేకపోవటానికి గానీ, వర్తకులు సరుకు నిల్వచేయటానికి గానీ, సరుకులు సరిగా డిస్ట్రిబ్యూట్ కాకపోవటానికిగానీ, కంట్రోలుధరలు సరిగా అమలుజరగకపోవటానికి గానీ, ప్రభుత్వంయొక్క అసమర్థత, చేతకానితనమే ప్రధానకారణం దీనికితోడు ప్రభుత్వోద్యోగులలో లంచగొండితనంకూడా బాగావ్యాపించి ఉంది. పైగా ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్య సామరస్యం లేదు. అందుకనే అనేకచోట్ల సరుకుల్ని స్వాధీనం చేసికొన్నా, ప్రజలకు సరియైన పద్ధతిప్రకారం పంచియివ్వలేక పోతున్నారు.

## జాతీయప్రభుత్వం కావాలి

ప్రభుత్వఅసమర్థతవల్లకల్గిన ఆహారసంక్షోభం మూలంగా, జపానుఫాసిస్టుల బాంబులకు భారతదేశం గురిఅౌతున్న ఈ సమయంలో, భారతీయులలో నైతికశక్తి క్షీణించిపోతోంది. నైతికశక్తి నశించిపోయిననాడు. శత్రువులను ఎదుర్కొటానికీ, శత్రుబారినుండి దేశాన్ని సంరక్షించుకోటానికీ ప్రజలు సన్నద్ధులుకాలేరు. పైపెచ్చు నేటి ఈ సంక్షోభాన్ని పురస్కరించుకొని, వందమాంగదళంవాళ్ళు ప్రజల నైతికశక్తిని మరింత కుంటుపర్చుటకు ప్రయత్నిస్తున్నారు.

అందువల్ల యీ ఆహారసమస్యను పరిష్కరించటానికి ప్రజల అభిమానాన్నీ, విశ్వాసాన్నీ చూరగొన్న జాతీయ ప్రభుత్వమే సమర్థమౌతుంది. కాని యీ నిరంకుశ ప్రభుత్వం దిగ్గదిగునుకు కూర్చుంది. జాతీయప్రభుత్వ మున్నా లేకపోయినాసరే, తక్షణమే నేడు దేశమంతటా కమ్ముకున్న యీ ఆహారసమస్యను పరిష్కరించటంకోసం ప్రతి భారతీయుడూ సంసిద్ధం కావాలి.

## దేశమంతటా ప్రజాందోళన

ఇప్పటికప్పుడే ఈసమస్యనుగురించిన ఆందోళన తీవ్రరూపందాల్చింది. బొంబాయిలో సమావేశమైన భారతవాణిజ్య సంఘంవారు, కేంద్ర ఆహారపదార్థాల విషయంలో జోక్యం కల్గించుకోవాలనీ, ఆస్ట్రేలియానుంచిగాని, మరోచోటినుంచిగాని గోధుమలను దిగుమతిచేయించాలనీ వైస్రాయికి తంతినిచ్చారు. పురుషోత్తమదాసు టాండన్ మొదలగు ప్రముఖులు గవర్నరువద్దకు రాయబారం వెళ్ళారు. బెంగాల్ రాష్ట్రీయ హిందూమహాసభవారు, ఆహారపదార్థాలను అందరికీ సమానంగా పంచిపెట్టాలనీ, రేషనింగు యేర్పాటుచేయాలనీ తీర్మానం చేశారు. ఆహారసమస్యను పరిష్కరించడంకోసం డిసెంబరు 30 వ తేదీన కలకత్తాలో సమావేశమైన వివిధ పార్టీల ప్రతినిధులు యీ క్రిందితీర్మానంచేశారు: "ప్రస్తుత క్లిష్టసమయంలో సరియైన విధానం చూపించడానికిగానీ, ప్రజలకు సహాయపడటానికి గానీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అందువల్ల అవసరమైన సరుకుల్ని సప్లయి చేయించుతూ చౌక డిపోలను ఇంకాఎక్కువగా ఏర్పాటుచెయ్యాలి. దొంగవ్యాపారాన్ని అణచడానికి నూటికిమారుపాళ్ల కంట్రోలు అమలులో పెట్టాలి. బెంగాల్‌నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేయకూడదు: మిలిటరీ సప్లయిలకు, అదనంగా కలిగిన రాష్ట్రాలనుంచే సరఫరా చేయించాలి. సరియైన ధరలకు ప్రజలకు సరకులు అందునట్లు చూడటానికీ, అవసరమైన పదార్థాలను ఇతరచోట్లనుండి తెప్పించుకోటానికీ, దొంగవ్యాపారాన్ని అరికట్టడానికీ, ప్రజాసంఘాలను (పీపుల్సు కమిటీలు) స్థాపించాలి." అని ఆ తీర్మానంలోవుంది.

## క్షుధార్తులారా! ఐక్యంకండి

ఈ సూచనలు చాల సమంజసంగా ఉన్నాయి. ప్రజలందరూ ఐక్యమై ప్రజారక్షణ సంఘాలను నిర్మించుకుని, యీ తిండి దొంగల్ని అంతమొందించాలి. యీ క్లిష్టసమయంలో ప్రజలు ఐక్యంకాకుంటే — తిండిలేక మలమల మాడిపోవాల్సి వస్తుంది. ఎంతోమంది ప్రజల ప్రాణాల్ని నిరంకుశ ప్రభుత్వ అసమర్థతకు బలిచేయవలసివస్తుంది. కాబట్టి ఏకంకండి. ప్రజారక్షణ సంఘాలను నిర్మించుకోండి.

— ప్రభుత్వ అసమర్థతను నశింపజేయండి.
— జాతీయప్రభుత్వాన్ని స్థాపించండి.
— ఆకలిబాధను పోగొట్టుకొండి.

కామ్రేడ్
కాట్రగడ్డ రాజగోపాలరావు.

Published by Katragadda Rajagopala Rao, and Printed by The Popular Printers, Governorpet, Bezwada.

# END OF ISSUE